క్లుప్తంగా

29న మెగా లోక్ అదాలత్



విలేకరులతో మాట్లాడుతున్న అదనపు జడ్జి శ్రీనివాసరావు

కొవ్వూరు: నెల 29వ తేదీన జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంసథ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. రాజీ పడే అన్నీ రకాల సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చునని సూచించారు. చెక్ బౌన్స్, ప్రమాద బీమా కేసులు, బీఎస్ఎన్ఎల్ బకాయిలు, ప్రి లిటికేషన్ కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చునని ఆయన సూచించారు. కక్షిదారులు రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే ఖర్చులు ఆదా అవుతాయని సూచించారు.

నేడు మండల సమావేశం

కొవ్వూరు: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. మంగళవారం కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులంతా విధిగా హాజరు కావాలని ఆమె కోరారు. మండలంలో చేపట్టే అభివృద్ధి పనులపై ఎంపీపీ కాకర్ల నారాయుడు ఆధ్వర్యంలో సమీక్షించనున్నట్లు తెలిపారు.

తాళ్లపూడి: తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంతో మంగళవారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో టీబీ వెంకట రమణ తెలిపారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు హాజరుకానున్నట్టు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



తూర్పుచోడవరంలో ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల: తూర్పుచోడవరానికి చెందిన బాలుడు నిమ్మకాయల సాయితనయ్ సీబీ సింద్రోం అనే వ్యాధితో బాధపడుతున్నాడు. రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతున్నాడు. వారి కుటుంబసభ్యులకు రూ.5వేల ఆర్థిక సాయం అందించగా రిటైర్డు హెచ్ఎం నందం రాజేంద్రప్రసాద్ మరో రూ.వెయ్యి అందజేశారు. అదే గ్రామంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న తొంటా నాగమణికి మానవత సంస్థ రూ.5వేలు ఆర్థిక సాయం అందజేసింది. ఈ కార్యక్రమంలో ఐడీవీ అప్పారావు, భోగవల్లి వెంకట సుబ్బారావు, జి.వెంకటరత్నం, దావులూరి చిరంజీవి, ఉప్పాడ కామేశ్వరావు, నందం రాజేంద్రప్రసాద్, మద్దు రామకృష్ణ, గన్నమని రామలింగేశ్వరావు, లేళ్ల తాతారావు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

గోపాలపురం: జేఈఈ అడ్వాన్స్ ఆలిండియా 1046 ర్యాంకు సాధించిన వేళ్లచింతలగూడెం విదార్థిని కొలూరి శ్రీజ ఉన్నత చదువులకు మానవత స్వచ్ఛంద సంస్థ సాయం అందించింది. సంస్థ జిల్లా విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు విద్యార్థి 3ఏళ్ల చదువుకు గానూ రూ.30వేల ఆర్థిక సహాయాన్ని శ్రీజ కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. అంతేకాకుండా మండల మానవత సంస్థ రూ.5 వేలు, బియ్యం వ్యాపారి దోనాదులు అప్పిరెడ్డి రూ.వెయ్యి అందజేశారు. ఈ కార్యక్ర మంలో మానవత మండలచైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, అధ్యక్షుడు ముప్పన కృపాప్రసాద్, పప్పు సత్యకృష్ణారెడ్డి, కె.కీర్తికుమార్, రాపాక ఫణికిషోర్, కె.నాగరాజు మానవత సభ్యులు పాల్గొన్నారు.

మానవత మండల శాఖ అధ్యక్షురాలిగా ఝాన్సీరాణి



నల్లజర్ల: మండల మానవత నూతన అధ్యక్షురాలిగా రుద్రపాక ఝాన్సీరాణి ఎంపికయ్యారు. నల్లజర్లలో జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకటసూర్యనారాయణ అధ్యక్షతన గ్రామ కన్వీనర్ల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కన్వీనర్ల సేవలు ఎనలేనివన్నారు. సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొంటున్నారని, ఎవరైనా పేదలు అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారి వివరాలు మండల కమిటీకి తెలియజేస్తే తగు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. శాంతిరథం, మార్చురీ ఫ్రీజర్ సేవలు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరానికి మండలశాఖ నూతన అధ్యక్షురాలిగా రిటైర్డు ఎంఈఓ రుద్రపాక ఝాన్సీరాణిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశం ఆమెకు అభినందనలు తెలియజేసింది. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఐడీవీ అప్పారావు, చైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, జిల్లా ట్రెజరర్ గుళ్లపూడి వెంకటరత్నం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు.. పరిశుభ్రతే మందు..

- కురుస్తున్న వర్షాలు.. ప్రబలుతున్న వైరల్ జర్వాలు
- గ్రామాల్లో ముమ్మరంగా ఫీవర్ సర్వేలు
- అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన



పట్టణంలో ఎల్‌బీఎస్ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నిడదవోలు: వానాకాలం వచ్చింది. వాతావరణంలో మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అపరిశుభ్రత, ఆహారంలో లోపాల కారణంగా రోగాలు వస్తాయి. ముందు జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పటికే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వర్షాపు నీరు నిలిచి ఉండడం, పరిసరాల పరిశుభ్రత లేకపోవడం, తాగునీరు, గాలి కలుషితం, మురుగు కుంటల్లో దోమలు వృద్ధి చెందడంతో వైజర్ జ్వరాలు వస్తున్నాయి. ఇప్పటికే జ్వరాలతో జనం ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.

ఆరు డయేరియా కేసులు

పట్టణంలోని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రి, రెండు అర్బన్ హెల్త్ సెంటర్లకు అధిక సంఖ్యలో రోగులు జ్వరం, జలుబుతో వెళ్తున్నారు. నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం ఆరు డయేరియా కేసులు నమోదయ్యాయి. వీరే కాకుండా ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో రోగుల తాకిడి ఎక్కువగానే ఉంటోంది. ఈ సీజన్‌లో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కామర్లు, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

పట్టణ, గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫీవర్ సర్వేలు చేస్తున్నారు. ప్రజలకు తమ ఇళ్ల చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని చెబుతున్నారు. అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పట్టణ పరిధిలో వైద్య సిబ్బంది అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తూ అధికారులకు తెలియజేస్తూ పారిశుద్ధ్య మెరుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇంటింటికీ వెళ్లి జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతోపాటు రోగాల బారినపడుతున్న వారి రక్త నమూనాలను సేకరిస్తున్నారు.



పట్టణంలో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పారిశుధ్య పనులు

పట్టణంలో ప్రతి వార్డులో పారిశుధ్య కార్మికులు డ్రైనేజీలు శుభ్రపరచడం, మురుగునీరు ఉన్నచోట పరిశీలించి క్లోరినేషన్ చేస్తున్నారు. నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రి, అదేవిధంగా ఉండ్రాజవరం, పెరవలి, కానూరు, తాడిమళ్ళ, సమిశ్రగూడెం పీహెచ్‌సీలలో వైద్యులు అందుబాటులో ఉండి జ్వరాలతో వస్తున్న వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. పట్టణంలో ఉన్న రెండు అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్యులు పూర్తిస్థాయి వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు

- ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- కూలర్లు, టైర్లు, కొబ్బరి బొండాలు, ఇతర సామగ్రి, తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- నిల్వ ఉన్న నీటిలో కిరోసిన్ గాని లేదా పురుగు మందు కలపాలి.
- దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలి.
- శరీరం మొత్తం కప్పేలా దుస్తులు ధరించాలి.
- రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- నిల్వ పదార్థాలు తినకూడదు. తాజా, వేడి ఆహారం తీసుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలి.
- శుభ్రమైన ఆహారం తీసుకోవాలి.
- రోజుకు 3 నుంచి 4 లీటర్లు నీళ్లు తాగాలి.
- పండ్ల రసం, కొబ్బరి నీళ్ల, సూప్ వంటివి తీసుకోవాలి.
- వైద్యుల సూచనల మేరకు వైద్యం తీసుకోవాలి.

పరిశుభ్రత తప్పనిసరి



వర్షాకాలంలో వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుంది. ఇది బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్, దోమలు వృద్ధి చెందడానికి అనువైన కాలం. ఈ కాలంలో ఇమ్యూనిటీ కూడా కొంత బలహీనపడుతుంది, దీంతో అనారోగ్యాలు ఎక్కువగా దాడి చేస్తూ ఉంటాయి. ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలంలో వచ్చే అనారోగ్యాలకు తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, విరేచనాలు, చర్మ సమస్యలు వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. వీటిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకం కావచ్చు. రెండు రోజులకు మించి జ్వరం తగ్గకుంటే స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సంప్రదించాలి. సాధ్యమైనంత వరకు నీళ్లు కాచుకుని తాగాలి. ఆస్పత్రిలో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు యాంటీబయాటిక్స్, సెలైన్ బాటిల్స్, పారాసెట్మల్ మందులు అందుబాటులో ఉన్నాయి. జ్వరం వస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ ఈ తేజశ్రీ, వైద్యధికారి, నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్, నిడదవోలు

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



కొవ్వూరులో తహసీల్దార్‌పై ఫిర్యాదు చేస్తున్న ఫొటోగ్రాఫర్స్ యూనియన్ నాయకులు

నల్లజర్ల: ప్రభుత్వం పథకాల పేర్లు మార్చినట్టుగానే స్పందన కార్యక్రమం పేరును ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరిట సోమవారం తహసీల్దారు పి.కృష్ణారావు ప్రజలు, రైతుల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాల్సిన ఎంపీడీఓ, వైద్య, ఆరోగ్యశాఖ, వ్యవసాయ, రోడ్లు భవనాలశాఖ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు డుమ్మాకొట్టారు.

తాళ్లపూడి: స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో ఎన్నికల కోడ్ అనంతరం మూడు నెలల తరువాత సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టం) నిర్వహించారు. ప్రజల నుంచి మండల అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. మొదటి రోజు కేవలం ముగ్గురు మాత్రమే తమ అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకట రమణ, ఎంఈవోలు సీహెచ్ బాలామణి, సీహెచ్ నెహ్రూజీ, ఏఈ సీహెచ్ వెంకట్రావు, ఏవో జి.రుచిత పాల్గొన్నారు.

చాగల్లు: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమం చాగల్లు మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.సావిత్రి నిర్వహించారు. ఆమె ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఐదు అర్జీలు అందాయని ఆమె తెలిపారు.

కొవ్వూరు: సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులందాయని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. వీటిలో ప్రధానంగా దొమ్మేరుకి చెందిన కేవీ రంగారావు రైతులకు అందాల్సిన ధాన్యం సొమ్ములు ఇప్పించాలని కోరారు. నందమూరుకి చెందిన బొందల లక్ష్మణరావు తన సొలానికి పాసు పుస్తకాలు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. పశివేదల గ్రామానికి చెందిన వేములపల్లి ఆది వెంకట సూర్యనారాయణ డ్రైనేజిని శుభ్రం చేయించాలని విన్నవించుకున్నారు. పట్టణానికి చెందిన యాళ్ల రామలక్ష్మి ఇందిరమ్మ కాలనీలో తన ఇంటి వద్ద టేకు చెట్టుకింద తాగునీటి పైపులైను ఉన్న కారణంగా నీరు రావడం లేదని, ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం ఫిర్యాదు చేసింది. పట్టణానికి చెందిన కొత్త నాగేంద్రకుమార్ 13వ వార్డులో విపరీతంగా చెట్లు పెరగడం మూలంగా విష సర్పలు వస్తున్నాయని, వీధి లైట్లు సక్రమంగా వెలగడం లేదని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పెనకనమెట్ట సావరానికి చెందిన మేకల పట్టాభి రామారావు నాడు-నేడు కింద పాఠశాలకు మంజూరైన నిధులు వినియోగంపై విచారణ చేయాలని కోరారు. గోపాలపురం తహసీల్దార్ సార్వత్రిక ఎన్నికల సమయంలో ఫొటోగ్రాఫర్స్‌కి చెల్లించాల్సిన సొమ్ములు వెనక్కి తీసుకుని తిరిగి చెల్లించడం లేదని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిర్రా సూర్య వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా వీడియో, ఫొటో గ్రాఫర్లను అవమానకరంగా మాట్లాడుతున్నట్టు ఆరోపించారు. ఈ అంశంపై విచారణ చేసి వీడియో, ఫొటోగ్రాఫర్స్‌కి చెల్లించాల్సిన సొమ్ములు ఇప్పించాలని కోరారు. డివిజన్ స్థాయిలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీ మార్పులోనూ రాజకీయమే..

- గడువు ఉన్నా అధికార బలంతో మార్చేశారు
- పాత ఏజెన్సీ నిర్వాహకురాలి ఆవేదన



రాజంపాలెం పాఠశాల వద్ద కాపలా ఉన్న పోలీసులు

గోపాలపురం: రాజంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంట ఏజెన్సీ మార్పు విషయంలోనూ రాజకీయం చేస్తున్నారు. సోమవారం ఈ మేరకు పాఠశాల వద్ద నూతన వంట ఏజెన్సీ ఏర్పాటు చేసి పోలీసుల సమక్షంలో పాఠశాలలో విద్యార్థులకు వంటలు చేసి వడ్డించారు. పాత ఏజెన్సీకి గడువు ఉన్నా కొత్త ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఏజెన్సీ మార్పు చేయాలంటూ మమ్మల్ని వేధింపులకు గురిచేశారని పాత ఏజెన్సీ నిర్వాహకురాలు కె.గీతిక ఆరోపించింది. ఏజెన్సీ ఏర్పాటుకు రూ.3లక్షల వ్యయంతో వంట సామగ్రి కొనుగోలు చేసినట్లు ఆమె తెలిపారు.

పెరిగిపోతున్న టీడీపీ నాయకుల ఆగడాలు

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి ఆగడాలు మరింత పెరిగిపోతున్నాయని రాజంపాలెం సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మి అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే గ్రామ పంచాయతీకి రంగులు మార్చడం టీడీపీ వారి అనుచరులతో బూతులు తిట్టించడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల వంట ఏజెన్సీ విషయంలో సర్పంచ్‌కు ఎటువంటి సమాచారం లేకుండా అధికార బలంతో కొత్త ఏజెన్సీ ఏర్పాటు చేశారన్నారు. దీనిపై పాఠశాల హెచ్ఎం డి.సంపూర్ణ విజయను వివరణ కోరగా పాత వంట ఏజెన్సీ వారికి నోటీసులు జారీ చేసి, కొత్తఏజెన్సీ నియామకం విద్యాకమిటీ, తల్లిదండ్రుల సమక్షంలో ఎన్నిక నిర్వహించినట్టు తెలిపారు. పాఠశాల వద్ద ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తుగా పోలీసుల సహాయాన్ని తీసుకున్నట్టు ఆమె పేర్కొన్నారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన ఉండాలి

గోపాలపురం: నగదు రహిత లావాదేవీలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని గోపాలపురం యూనియన్ బ్యాంకు మేనేజర్ ఎస్.కిషోర్ అన్నారు. స్థానిక బీసీ కాలనీలో సోమవారం డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, నగదు రహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ కిషోర్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండి డిజిటల్ చెల్లింపులు చేయాలన్నారు. ప్రాజెక్టు మేనేజర్ వి.అశోక్‌కుమార్, వర్కుషాపు రిసోర్స్ పర్సన్స్ ఎస్.అనిల్, కె.దుర్గ, కె.రవీంద్ర బ్యాంకు డైరెక్టర్ వి.ఆంజనేయులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు

కొవ్వూరు: మాదకద్రవ్యాలు(డ్రగ్స్) వాడకం ద్వారా కలిగే దుష్ప్రభావాలపై యువత అవగాహన పెంచుకోవాలని, మత్తు పదార్థాల జోలికి పోయి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు సూచించారు. సోమవారం పట్టణంలో ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వాడకం మూలంగా కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎస్‌వీ సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే లక్ష్యం

నిడదవోలు : డ్రగ్స్ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిడదవోలు ఎస్ఈబీ ఇన్స్‌పెక్టర్ కె.వీరబ్రహ్మం సూచించారు. జిల్లా ఎస్ఈబీ బ్యూరో పిట్ట సోమశేఖర్ ఆదేశాల మేరకు పెరవలి మండలం కానూరు శశి హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు డ్రగ్స్ అక్రమ రవాణా, డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సై ఆర్. దొరబాబు, ప్రిన్సిపల్ ఎస్. ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

తాళ్లపూడి: గజ్జరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయలు కావడంతో ఆపస్మారక స్థితికి చేరిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గోపాలపురం మండలం గోపవరం గ్రామానికి చెందిన కోవిడి రమేష్ మోటార్‌సైకిల్‌పై వస్తుండగా గజ్జరం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం కావడంతో ఆపస్మారక స్థితికి చేరాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ఆసుపత్రికి తరలించినట్టు సమాచారం. అతని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై .శ్యామ్‌సుందర్ తెలిపారు.

ఘనంగా మాజీ మంత్రి వనిత జన్మదిన వేడుకలు



మాజీ మంత్రి వనితకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు



వనితకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న దేవరపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు స్వర్ణలత

దేవరపల్లి: రాష్ట్ర మాజీ హోం శాఖ మంత్రి తానేటి వనిత జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తాడేపల్లిగూడెంలోని ఆమె స్వగృహంలో జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. భారీ కేక్ కట్ చేసి ఆమె కార్యకర్తలు, పార్టీ శ్రేణులకు పంచారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొని మాజీ మంత్రి తానేటి వనితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, మండల కన్వీనర్ కడలి హైమావతి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మేడిబోయిన గంగరాజు, నియోజకవర్గ అధికార ప్రతినిధి గడా జగదీష్, ద్వారకా తిరుమల మండల కన్వీనర్ ప్రతాపనేని వాసుబాబు, ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు వెలగా శ్రీరామూర్తి, దేవరపల్లి మండల బూత్ కమిటీల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్, నియోజకవర్గ గ్రామ సచివాలయాల కన్వీనర్ ఆచంట సురేష్ తదితరులు పాల్గొని వనితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై సమీక్ష



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్


చాగల్లు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.బుజ్జి అన్నారు. సోమవారం చాగల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల పై మండలస్థాయి టాస్క్ ఫోర్సు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేయాలనీ కోరారు. ముఖ్యంగా నీటిని క్లోరినేషన్ ప్రతిరోజూ చేయాలని, వర్షాకాలం అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా డయేరియా(అతిసార) కేసులు నమోదు అయితే వెంటనే వైద్యాధికారికి విషయం తెలియచేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి ఆర్.శ్రావణ్ కుమార్, డాక్టర్ నిశిత తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: వర్షాకాలంలో అంటు వ్యాధులు రాకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ సూచించారు. సోమవారం ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, వివిధ శాఖల ఏఈలతో కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జూలై ఒకటో తేదీ నుంచి ఆగస్టు 31 వరకు నిర్వహించే స్టాఫ్ డయేరియా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ కాచి చల్చార్చిన నీటిని తాగాలని, భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా చేసుకోవాలన్నారు. తహసీల్దార్ కె.నవీన్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ భవానీ, ఆయా శాఖల ఏవోలు, ఏఈలు, ఆరోగ్య పర్యవేక్షకులు జి.శ్రీనివాస్, కె.కుమారి, పాల్గొన్నారు.

27న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ హుండీని ఈనెల 27వ తేదీన ఉదయం 8 గంటలకు తెరిచి లెక్కించనున్నట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ సోమవారం తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరబాబు

కొవ్వూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరణకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎం సుందరబాబు పేర్కొన్నారు. పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో ఇచ్చిన 1214 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా రావాల్సిన పథకాలను పునరుద్ధరించాలన్నారు. ఐదేళ్లలో ప్రమాదవశాత్తు మృతి చెందిన, వైకల్యం పొలైన భవన నిర్మాణ కార్మికులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. జిల్లా సంఘం అధ్యక్షుడు వల్లేపల్లి నరసింహామూర్తి, జిల్లా సంఘం గౌరవ అధ్యక్షుడు మైగాపుల నాగేశ్వర రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మదుకూరి దొరయ్య, జిల్లా కమిటీ సభ్యులు మానికిరెడ్డి హరిబాబు, వీరా త్రిమూర్తులు, కొమ్మన రాముడు, జెట్టి రామకృష్ణ, ఎస్‌కే ఆదాము, పసుపులేటి వెంకటేశ్వరరావు, ఆకుమూరి రాంబాబు, సిద్దిరెడ్డి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకు ప్రారంభం

- పాఠశాలలో రూ 2.75 లక్షల వ్యయంతో నిర్మాణం
- దాతలకు కృతజ్ఞతలు తెలిపిన ఉపాధ్యాయులు, విద్యార్థులు



కొవ్వూరుపాడులో నిర్మించిన మంచినీటి ట్యాంకు

గోపాలపురం: కొవ్వూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో దాతలు మంచినీటి ట్యాంకును నిర్మించారు. ఆ గ్రామానికి చెందిన దస్తావేజు లేఖరి పాఠశాల స్థలదాత స్వర్గీయ చోరగుడి కృష్ణారావు సోదరుడు స్వర్గీయ చోరగుడి సుబ్బారావు జ్ఞాపకార్థం భార్య రాజేశ్వరి వారి కుమారులు రాజశేఖర్, ఉదయ్ కుమార్ రూ 2.75 లక్షల వ్యయంతో నిర్మించిన మంచినీటి ట్యాంకును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం డి.శేషారత్నం, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే మస్తాన్‌బాబా, పాఠశాల విద్యాకమిటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

అందరికీ సురక్షితమైన మంచినీరు

దేవరపల్లి: ప్రతి గ్రామంలో ప్రజలకు సురక్షితమైన మంచినీరు సరఫరా చేయాలని గ్రామ సచివాలయాల కార్యదర్శులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి ఎంపీడీఓ పి.ప్రభాకరరావు సూచించారు. మండలంలోని సచివాలయాల కార్యదర్శులు, మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందికి గ్రామీణ మంచినీటి సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ ప్రభాకరరావు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి 10 వేల లీటర్ల నీటిలో 40 గ్రాముల బ్లీచింగ్ వేసి, 40 నిముషాల తర్వాత ప్రజలకు సరఫరా చేయాలన్నారు. డ్రైనేజీల్లో పూడికతీసి శుభ్రం చేయాలని, దోమల మందు పిచికారీ చేయాలని ఆయన సూచించారు. వైద్యాధికారులు డాక్టర్ సతీష్ (గౌరీపట్నం), డాక్టర్ సంజీవ్(దేవరపలి), డాకర్ హరిచందన(యాదవోలు), సిబ్బంది పాల్గొన్నారు.

26 నుంచి గోవిందుడి బ్రహ్మోత్సవాలు

కొవ్వూరు: పట్టణంలో గోష్పాదక్షేత్రంలోని సుందర గోవిందుడి ఆలయం బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 30వ తేదీన వివిధ పవిత్ర నదీ జలాలతో 1,116 కలశాలతో సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.